# ప్రస్తుత వ్యవస్థ అర్ధఫ్యూడల్ స్వభావాన్ని చాటిచెప్తోన్న అంటరానితనం, దళితులపై దాడులు

**దేశ** వ్యాపితంగా పాలకవర్గ పార్టీలన్నీ అంబేద్కర్ 125వ జయంతిని ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో 'ఘనంగా' నిర్వహించాయి. ఎవరికి వారు దళితుల అభ్యున్నతికి తమను తాము ఛాంపియన్లుగా ప్రకటించు కున్నారేగానీ, దళితులపై దేశ వ్యాపితంగా పెచ్చు మీరుతున్న వివక్ష, దాడులు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కారాలు, సామూహిక హత్యాకాండల గురించి కానీ, ఈ ఘటనల మూలకారణాన్ని గురించికానీ, కనీసం ఈ ఘటనలు జరుగుతున్న గ్రామాల్లో భూములపై, సంపదలపై ఆధిపత్యం కలిగి, అధికార రాజకీయపార్టీల అండదండలతో యధేచ్ఛగా ఈనాటికీ కులవివక్ష, అంటరానితనం, దళితులపై, పేద, బడుగువర్గాలపై అత్యాచారాలకు, హత్యాకాండలకు పాల్పడుతున్న వారిని శిక్షించేందుకు చేపట్టిన చర్యల గురించికానీ మాట్లాడకుండా దాటవేశారు. తాము అధికారంలో వుండగా దళితులపై జరిగిన నేరాల గురించి పెదవి విప్పకుండా, విపక్షాల పాలనలో దళితులపై దాడుల గురించి దుమ్మెత్తి పోయడానికే ఎవరికి వారు ఉద్దేశ్యపూర్వకంగా పరిమితమయ్యారు.

12-6-12న (జూన్ నెలలో) శ్రీకాకుళంజిల్లా లక్షింపేటలో; 17-7-85న (జులై నెలలో) ప్రకాశంజిల్లా కారంచేడులో; 6-8-91న (ఆగస్టు నెలలో) గుంటూరు జిల్లా చుండూరులలో దళితులపై సామూహిక హత్యా కాండలు జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నా, ఈ ఘోరాలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించేందుకు అగ్రకుల, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పాలక ప్రభుత్వాలు పూనుకోవటంలేదు. చట్ట సభలు, న్యాయ, పోలీసు, పాలనా యంత్రాంగమంతా దోపిడీ పాలకుల కనుసన్నలలో నడుచుకుంటూ దాడులకు పాల్పడిన అగ్రకుల, సంపన్న వర్గాలను ఏదో ఒక దొంతరలో నేరాన్నుండి విముక్తి చేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గత కొద్దికాల వ్యవధిలోనే దళితులపై వివిధ రూపాల్లో సాగుతోన్న వివక్ష, దాడులు, అకృత్యాలలో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.

**తమిళనాడు రాష్ట్రం**-పాలొచ్చిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకొంటున్న అగ్రకులానికి చెందిన కౌసల్య (11 సం॥లు), దళితుడైన శంకర్ (22 సం॥లు)లు ప్రేమ వివాహం చేసుకోవటాన్ని కౌసల్య కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోయారు. 13-3-16న తిర్పూరు జిల్లా, ఉదుములపేటలో నివాసం వుంటున్న ఈ దంపతులపై, శంకర్‌ను లక్ష్యంగా చేసుకొని మోటారుసైకిళ్ళపై మారణాయుధాలతో వచ్చిన ముగ్గురు దాడిచేశారు. ఈ దాడిలో శంకర్ చనిపోగా, అడ్డుబోయిన కౌసల్యకు తీవ్రగాయాలై ఆస్పత్రి పాలైంది.

**తమిళనాడు రాష్ట్రం**లోనే - తిరునెల్వేలిలో అగ్రకులానికి చెందిన కావేరి (25 సం॥లు) అనే ఇంజనీరింగ్ పట్టభద్రురాలు ఎన్. విశ్వనాధన్ అనే దళితుని ప్రేమించి, పెద్దలకు భయపడి 2016 జనవరిలో రహస్యంగా వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొంత కాలం విడివిడిగా వున్న ఈ దంపతులు మే 3వ తేదీ నుండి దూరంగా వెళ్ళిపోయి కలిసి జీవించటం ప్రారంభించారు. దీనితో కావేరి తరఫు బంధువులు విశ్వనాధన్ ఇంటికి వెళ్ళి వారి తల్లిదండ్రులను పలుమార్లు బెదిరించారు; పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. 15-5-16న విశ్వనాధన్ ఇంటికి వెళ్ళి, అతని చెల్లెలు కల్పనపై దాడిచేసి కొట్టడంతో ఆమె మృతిచెందింది.

**కర్నాటక రాష్ట్రం** - హసన్ జిల్లా, హోలెనరసిపూర్ తాలూకా, సిగరన హళ్ళి గ్రామంలో బసవేశ్వర దేవాలయంలోకి దళితుల ప్రవేశాన్ని అగ్రకులస్థులు అడ్డుకొని, వారిపై దాడికి పాల్పడ్డారు. గత సంవత్సరం ఈ దేవాలయంలోకి ప్రవేశించినందుకుగానూ కొందరు దళిత మహిళలపై గ్రామపెద్దలు జరిమానా విధించారు. ఇది గ్రామంలో ఉద్రిక్తతలకు దారితీయగా, ప్రభుత్వాధికారులు కలగజేసుకొని దళితులను దేవాలయంలోకి పంపారు. దీని ఫలితంగా దేవాలయం అపవిత్రం అయినదని, ఆనాటి నుండి అగ్రకులస్థులు ఆ దేవాలయాన్ని పూర్తిగా మూసివేశారు. దీని మీద తిరిగి సంఘర్షణ ఫలితంగా, 2016 మార్చి 25న ఈ దేవాలయాన్ని తెరిచారు. ఆ తర్వాత కూడా అగ్రకులస్థులు దళితులకు ఆలయ ప్రవేశాన్ని నిరాకరించారు. ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం అగ్రకుల దురహంకారులపై చర్య తీసుకోవటానికి బదులు, 2-4-16న దళితులను తలుపులు మూసిన గుడిముందు ప్రార్ధన చేసుకోమని చెప్పారు. దీనిని కూడా సహించని అగ్రకులస్థులు, 2016 ఏప్రిల్ 4న ఈ దేవాలయాన్ని తిరిగి మూసివేశారు.

**ఉత్తరప్రదేశ్ రాష్ట్రం** - కాన్పూరు గ్రామీణ జిల్లాలోని వీరసింగ్‌పూర్ అనే గ్రామంలో సర్పంచ్‌గా దళితకులానికి చెందిన పప్పీదేవి ఎన్నికైంది. దళితులు ఇలాంటి స్థానాలకు ఎన్నికైనా తమకు అణిగిమణిగి వుండాలని, స్వతంత్రంగా ఏమాత్రం వ్యవహరించరాదని అగ్రకుల దురహంకారుల ఆదేశం. ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలుకావటంలేదనే ఫిర్యాదుపై పరిశీలించటానికి పప్పీదేవి 6-2-16న ఆ స్కూలుకు వెళ్ళింది. అక్కడ ఓ కుర్చీలో కూర్చొని వివరాలు సేకరించింది. కాగా, ఆమె వెళ్ళిన తర్వాత అగ్రకులానికి చెందిన హెడ్మాస్టర్ పిల్లలతో నీళ్ళు తెప్పించిమరీ ఆ కుర్చీని 'శుద్ధిచేయించాడు'!

**హర్యానా రాష్ట్రం**-కురుక్షేత్ర ప్రాంతంలోని 'భూస్థల' గ్రామంలో 2-5-16న దళిత సామాజికవర్గానికి చెందిన ఓ యువకుడు తన పెళ్ళి సందర్భంగా గుర్రంపై వూరేగటాన్ని సహించలేని గ్రామంలోని అగ్రకుల దురహంకారులు అ వూరేగింపుపై దాడిచేసి, గుర్రంపై ఊరేగే హక్కు దళితులకు లేదని చెప్పారు. దాడిలో పెళ్ళికొడుకు తరఫు బంధువులలో అనేకమందికి గాయాలయ్యాయి.

**మహారాష్ట్ర**లో – కరువుపీడిత విదర్భ ప్రాంతానికి చెందిన వసీమ్ జిల్లాలో, అగ్రకుల పెత్తందారులు దళితులకు మంచినీటిని సైతం నిరాకరించారు. మాలెగావ్ తాలూకా, కొలంబేశ్వర్ గ్రామస్థుడైన బాబూరావ్ తాజ్నే‌ను గ్రామంలోని బావి నుండి నీరు తోడుకోనివ్వలేదు. త్రాగునీటికి తీవ్ర యిబ్బందులనెదుర్కొన్న అతను, ఈ అవమానానికి ప్రతిగా, కసితో తమ దళిత కాలనీలో బావి తవ్వటం ప్రారంభించి, 40 రోజులలో బావి త్రవ్వేశాడు. అగ్రకుల దురహంకారులు ఇతనికి తాగునీళ్ళను ఇవ్వటానికి నిరాకరించారనే విషయాన్ని మరుగుపర్చిన ప్రభుత్వాధికారులు, 'ధృఢచిత్తం కలిగినవాడు'గా ఆ దళితుని ప్రశంసలతో ముంచెత్తారు!

**ఉత్తరప్రదేశ్ రాష్ట్రం** – దేశ రాజధానికి 80 కిలోమీటర్ల దూరంలోనున్న ముజఫర్‌నగర్ జిల్లాలోని భూప్‌ఖేడి గ్రామంలో దళితులకు జుట్టు కత్తిరించరాదని అగ్రకులస్థులైన ఠాకూర్లు గ్రామంలో నిషేధాజ్ఞలు విధించారు. గ్రామంలోని వృత్తిపని వాళ్ళందరూ దానికి ఎదురు చెప్పలేక, వారి ఆదేశానుసారమే అమలుచేస్తూ వచ్చారు. దీనితో గ్రామంలోని దళితులు క్షవరం చేయించుకునేందుకు పొరుగు గ్రామాలకు వెళ్ళి వస్తూ వున్నారు. ఇటీవల కాలంలో దళిత యువకులు దీనిని ప్రతిఘటించటం ప్రారంభించారు. 23-6-16న వారంతా ఒక సమావేశం నిర్వహించుకొని, ఈ దురాచారాన్ని రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ దురాచారం కారణంగా సమీప గ్రామస్థులెవరూ తమ వూరి దళితులతో వివాహ సంబంధాలకు సైతం నిరాకరిస్తున్నారు. మరోవైపున ఠాకూర్లు క్షౌర వృత్తి దారులను ప్రతిరోజూ బెదిరింపులకు గురిచేస్తుండటంతో వృత్తిదార్లు తమ షాపులను మూసివేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టరు విచారణకు ఆదేశించాడు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం** – విజయనగరం జిల్లా తారాపురం గ్రామంలో 2016 మే, జూన్ నెలలో దళితులు సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్థులందరికీ ఆలయకమిటి భోజనాలు ఏర్పాటుచేసింది. తీరా చూసేసరికి, దళితులకు వేరుగా టెంటు వేయడాన్ని గమనించి, దళితులంతా నిరసించారు. ఒకే టెంటులో అన్ని కులాలకు కలిపి భోజనం వడ్డించాలని వారు డిమాండ్ చేశారు. దీనికి నిరాకరించిన అగ్రకుల పెత్తందారులు, దళితులను కులం పేరుతో దూషించారు. దీనికి నిరసనగా దళితులంతా భోజనాలు చేయకుండానే వెనుదిరిగారు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. 11 మంది అగ్రకులస్థులపై కేసు నమోదుచేసి పోలీసులు వారిని అరెస్టు చేశారు. రిమాండ్ అనంతరం అగ్ర కులస్థులు బెయిల్‌పై తిరిగివచ్చిన తర్వాత, ఆగ్రహంతో వున్న అగ్రకుల దురహంకారులు దళితులను సామాజిక బహిష్కారం చేశారు. వారిని అగ్రకులాల వారి పొలాల్లో పనులకు రానివ్వలేదు; వారికి పాలు, కిరాణా వస్తువులు అందకుండా చేశారు; వారి ఇళ్ళకు కేబుల్‌వైర్లను తొలగింపజేశారు; గ్రామీణ ఉపాధిహామీ పథకం నుండి కూడా దళితులను మినహాయించారు; ఇక్కడ హోటళ్ళలో దళితులకు ఆకులలో, ఇతర కులస్థులకు ప్లేట్లలో టిఫిన్ అందిస్తారు. దీనిని కూడా అందకుండా అడ్డుకున్నారు. రెండునెలలుగా సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా అధికారులెవరూ ఈ గ్రామానికి రాలేదు, దీనిని అమలు చేస్తున్న అగ్రకుల పెత్తందారులపై ఏ చర్యా తీసుకోలేదు.

**ఉత్తరప్రదేశ్ రాష్ట్రం**, షాజన్‌పూర్ జిల్లాలో ఖైరాతియా గ్రామంలో చిన్నపాటి భూవివాదాన్ని తమకనుకూలంగా పరిష్కరించుకునేందుకు అగ్రకుల పెత్తందార్లు 15-5-16న ఆ గ్రామంలోని ఓ దళిత మహిళను ఇంట్లో నుండి బయటకు లాగి వివస్త్రను చేసి తీవ్రంగా కొట్టారు. కర్రలతో, రాడ్లతో కొడుతూ వివస్త్రగానే వీధుల్లో నడిపించారు. సరిగ్గా సంవత్సరం క్రితం ఈ ప్రాంతంలోని హరేవా అనే గ్రామంలోనూ దళిత మహిళలపై అగ్రకుల ఉన్మాదులు ఇదే తరహా దాడికి పాల్పడ్డారు. ప్రస్తుత ఘటనలో ఆ దళిత మహిళ ఇక నడవలేక కుప్పకూలిపోగా ఆమెను అక్కడ వదలి వెళ్ళిపోయారు. మర్నాడు ఉదయం ఆమె తన బంధువులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయబోగా, దానిని స్వీకరించటానికే పోలీసులు నిరాకరించారు. నేరస్థులతో కుమ్మక్కు అయిన పోలీసు అధికారులు, బాధిత దళిత మహిళ ఆరోపణలన్నీ అవాస్తవాలుగా కొట్టిపారేశారు.

**మహారాష్ట్ర**లోని జలగావ్ జిల్లా – రావేర్‌తాలూకా ఐద్రక్ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా అగ్రకులస్థులు ఓ వూరేగింపు నిర్వహిస్తూ అదే సమయంలో స్థానిక బుద్ధిస్టు కాలనీపై దాడికి పాల్పడి ఆరుగురిని గాయపరిచారు. అంతకుముందు రోజు ఆ కాలనీలో 125వ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన సభను పురస్కరించుకొని కాలనీవాసులు కట్టిన జెండాలను, బ్యానర్లను అగ్రకుల ఉన్మాదుల గుంపు పీకిపారేసింది. ఆపై వారు రాళ్ళు, ఇటుకలతో కాలనీవాసులపై దాడి చేశారు. బుద్ధిస్టు కాలనీకి గంటన్నరపాటు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. కులంపేరుతో దూషించారు. ఈ దాడిలో 38 సం॥ భరత్‌గాథే గాయాలపాలై ఆస్పత్రిలో మరణించాడు. 19 మందిని అరెస్టుచేసిన పోలీసులు యస్‌సి యస్‌టి అత్యాచార (నిరోధక) చట్టం క్రింద కేసు నమోదుచేశారు.

**మహారాష్ట్ర**లోని – బీడ్ జిల్లా సావర్‌గాంవ్‌లోని పెట్రోల్‌బంక్ దగ్గరలో అగ్రకుల యువకులు, తాము నడుపుతున్న మోటారు సైకిళ్ళను దాటి ముందుకు వెళ్ళిన 'నేరానికి'గానూ 24-7-16న ఇద్దరు దళిత యువకులను 25 మంది చుట్టుముట్టి తీవ్రంగా కొట్టారు. ఆ యువకుల మోటారుసైకిళ్ళపై అంబేద్కర్ బొమ్మలు అంటించి వుండటం చూసిన ఆ ఉన్మాదులు మరింత రెచ్చిపోయి దాడిచేశారు.

**బీహార్ రాష్ట్రం**–ముజఫర్‌పూర్‌జిల్లా పరుబ్లాక్‌లోని బాబూతోలా గ్రామ సమీపంలో జరుగుతున్న సంతకు వెళ్ళిన ఇద్దరు దళిత యువకులను జులై 20న ముఖేష్ ఠాకూర్ అతని అనుచరులు చుట్టుముట్టి ఒక గదిలో బంధించి 'ఠాకూర్ల మోటారు సైకిల్‌ను దొంగిలించార'నే ఆరోపణ చేస్తూ తీవ్రంగా కొట్టారు. అంతేగాక ఆ యువకులు దాహమని అడిగితే వారి నోట్లో మూత్ర విసర్జన చేశారు. విషయం తెలుసుకుని అక్కడకు వెళ్ళిన దళితుల బంధువులపైనా దాడి చేశారు.

**మధ్యప్రదేశ్ రాష్ట్రం** – ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే బధాని నియోజకవర్గ పరిధిలోని నస్రుల్లా ఘంజ్ ప్రాంతంలో, సెహార్ గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాలు, తమకు ప్రభుత్వం 15 సం॥ల క్రితం కేటాయించిన భూములను తమకు అప్పగించకుండా, గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లే అనుభవిస్తున్నారని ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. ఆ మేరకు వారంతా కలసి 2016 జులై 4న రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్రాత పూర్వకంగా ఒక మెమోరాండం అందచేస్తూ, జీవనోపాధి కరువైన తమకు బాధల నివారణకుగానూ మరణాన్ని ప్రసాదించవలసిందిగా కోరుతూ తమ దుస్థితిని ఆయనకు తెలియ చేశారు. జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారులు మాత్రం, ఆ గ్రామంలో అటువంటి సమస్య ఏదీ తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఇటువంటి సమస్యలు ఏనాడు వారి దృష్టికి వచ్చాయి కనుక?!

**కర్నాటక రాష్ట్రం** – చిక్‌మగులూరుజిల్లా, శాంతిపురా గ్రామంలో దళితులు, వ్యవసాయ కూలీలు అయిన బలరాజ్, ముత్తప్ప, ధనుష్, సందీప్, రమేష్‌లు ఒక 'ఆవును వధించార'నే పేరిట పోలీసుల సమక్షంలోనే 25 మంది బజరంగ్‌దళ్ కార్యకర్తలు జులై 10వ తేదీన దళితులపై మూకుమ్మడిగా దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరు దళితులకు ఎముకలు విరిగిపోయాయి. అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయి. కొసమెరుపు ఏమిటంటే 'కర్నాటక ప్రివెన్షన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ క్యాటిల్ ప్రొటెక్షన్ యాక్ట్ – 1964' చట్టం క్రింద దాడికి గురైన ఐదుగురు దళితుల పైననే పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేయటం!

**గుజరాత్ రాష్ట్రం** – సౌరాష్ట్ర ప్రాంతంలోని ఉనా పట్టణానికి దగ్గరలోని మోటా సమాధియాలా గ్రామంలో మృతిచెందిన ఆవు చర్మాన్ని వలుస్తున్న నలుగురు దళితులపై 'గో సంరక్షణ సమితి' పేరిట హిందూ మతోన్మాద గుంపు ఇనుపరాడ్లతో దాడిచేసింది. వారిని చేతులు కట్టివేసి బహిరంగంగా కొట్టుకొంటూ బజార్లలో నడిపించుకొంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వెళ్ళారు. 'గోవులను వధించిన వారెవరికైనా ఇదే గతి పద్తుంద'నే హెచ్చరికలతో, దళితులపై తాము సాగించిన దాడి తాలూకు వీడియోను ఉన్మాదుల మూక తమ వీరోచిత కృత్యంగా ప్రకటించుకుంటూ బరితెగించి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసుకుంది. దళితులపై దాడి దృశ్యాలు విస్తృతంగా ప్రచారం పొందటంతో దేశవ్యాపితంగానూ ముఖ్యంగా గుజరాత్ రాష్ట్ర వ్యాపితంగా దళితులు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన తెలియచేశారు.

1985లో రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమకారుల దాడులను ఖండిస్తూ దళితులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. ఆ తర్వాత కాలంలో మరలా ఈ సంఘటనే దళితులను తీవ్రంగా కదిలించింది.

దళితులపై దాడి ఘటనను నిరసిస్తూ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురు దళితులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, వీరిలో ఒకరు మృతిచెందారు.

సమాచారహక్కు ప్రకారం సేకరించిన వివరాలను బట్టి గుజరాత్ రాష్ట్రంలో 2005–13 మధ్యకాలంలో ప్రతి ఏడాదీ సగటున 18 మంది దళితులు హత్యకు గురయ్యారు; 37 మంది దళిత మహిళలపై అత్యాచారాలు జరిగాయి; 52 మంది తీవ్ర గాయాలపాలయ్యారు; ప్రతి సంవత్సరం వెయ్యికిపైగా దళిత కుటుంబాలు వేధింపులకు, దాడులకు గురయ్యాయి; 11 జిల్లాలలో కులవివక్ష వేళ్ళూనుకొని వుంది. పోలీస్‌స్టేషన్ గడపదాకా వచ్చి నమోదయ్యే కేసులలో 7.8 శాతం కేసులలోనే నేరస్థులకు శిక్షలు పడ్డాయి. ఈ గణాంకాలు ఒక్క గుజరాత్ రాష్ట్రానికే పరిమితం కాదు. కొద్దిగా అటూఇటూగానూ లేదా అనేక రాష్ట్రాలలో మరింత ఘోరంగానూ దళితులపై దాడులు, అత్యాచారాల ఘటనలు జరుగుతున్నాయనేది వాస్తవం. దళితుల సాధికారత కోసం అవిశ్రాంతంగా గత ఏడు దశాబ్దాలుగా 'స్వతంత్ర' భారత పాలకులు కృషిసాగిస్తున్నామని చెప్తున్న తర్వాత కూడా వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలలో కొన్ని మాత్రమే పైన పేర్కొన్నవి. దళితుల హక్కుల రక్షణకు, దళితులపై అత్యాచారాల నివారణకు పకడ్బందీ చట్టాలనేకం చేశామని పాలకులు పదేపదే చెప్తున్న తర్వాత కూడా జరుగుతున్న అనేకానేక సంఘటనలలో పైన పేర్కొన్నవి – 'సముద్రంలో నీటి బొట్టంత' మాత్రమే! సారాంశంలో మన దేశ పాలకుల మాటలకు – చేతలకు పొంతన లేదని, దళితులపై సామూహిక హత్యాకాండల మొదలు అత్యాచారాలు, దాడులు, అంటరానితనం, వివక్షల వంటి అమానవీయ, నీచమైన చర్యలన్నీ ప్రభుత్వాల, ఉన్నతాధికారుల, రాజ్య యంత్రాంగ అండదండలతో నిర్భీతిగా, యధేచ్ఛగా జరిగిపోతున్నాయనేది, అందరి కళ్ళెదుటా కనిపిస్తున్న వాస్తవమే!

కులాల దొంతరలను చెదరనీయకుండా విధి విధానాలతో కాపాడుతూ రావటం, నిచ్చెనమెట్ల కుల దొంతరల్లో పై మెట్టుపైనున్న కులం తన క్రింద మెట్లపైనున్న కులాలపై ఆధిపత్యం చెలాయించటం, అట్టడుగున వున్న దళితులపై అంటరానితనం పాటిస్తూ, వారిని తోటి మనుషులుగానే పరిగణించకపోవటం వంటివన్నీ ఫ్యూడల్ సమాజ ప్రతిఫలనాలే. అర్ధవలస – అర్ధఫ్యూడల్ వ్యవస్థగానున్న భారత సమాజంలో, తమ సామాజిక పునాది అయిన ఫ్యూడల్ సంబంధాలను సామ్రాజ్యవాదులు కొనసాగిస్తూ తమ దోపిడీని యధేచ్ఛగా సాగిస్తూ వస్తున్నారు. దేశం పెట్టుబడిదారీ యుగంలోకి పరిణామం చెందిందని విశ్లేషించే కొందరు – మనదేశంలో 80 శాతం ప్రజానీకం ప్రధానంగా ఆధారపడి వున్న గ్రామాల్లో అనునిత్యం జరుగుతున్న ఈ ఫ్యూడల్ దోపిడీ రూపాలను గుర్తించటంలేదు.

ఈనాటికీ గ్రామీణ ప్రాంతాలలో అత్యధిక భాగం భూములను గ్రామంలోని అగ్రకుల, భూస్వామ్య, పెత్తందారీవర్గాలే తమ గుప్పెట్లో బంధించివున్నాయి. వ్యవసాయ కూలీలలో అత్యధికులు దళితులుగా వుంటూ, గ్రామాలలోని ఫ్యూడల్ శక్తుల భూములపై ఆధారపడి జీవనం సాగించేవారుగా వున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య సంబంధాలను బ్రద్దలుకొట్టి 'దున్నేవానికే భూమి' నినాదంతో విప్లవ భూసంస్కరణలను అమలు చేయటం ద్వారా దళితులు, గ్రామీణ పేదలు భూస్వామ్య వర్గ దోపిడీ నుండి విముక్తి కాగలుగుతారు. 'దున్నేవానికే భూమి' సాధించటమంటే, గ్రామీణ ప్రాంతాల్లోని ఫ్యూడల్ సంబంధాలను తన సామాజిక భూమికగా చేసుకున్న సామ్రాజ్యవాదంపై యుద్ధం చేయటమే. సారాంశంలో, ఫ్యూడల్ భూస్వామ్యానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక – కర్షక మైత్రితో, వ్యవసాయక విప్లవం ఇరుసుగా సాగించే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే దళితుల విముక్తికి నిశ్చితమైన భూమిక ఏర్పడుతుంది.

దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగినపుడు వాటికి వ్యతిరేకంగా ప్రదర్శనాత్మక చర్యలకు పరిమిత మవకుండా, ఈ దాడులకు మూలమైన సామాజిక, ఆర్థిక కారణాలను వివరించి దళితులను చైతన్యయుతుల్ని చేసి పోరాటంలో నిలబెట్టాలి. దళితులకు భూమిపై హక్కు మొదలు దళితులపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సాగించే పోరాటంలో ఆధిపత్య కుల శక్తుల నుండి విడగొట్టుకున్న అన్ని కులాలలోని పీడితులు, శ్రమజీవులు దళిత శక్తులతో కలిసి ఉద్యమం సాగించాలి.

ooooo